క్లుప్తంగా

వాకర్స్ క్లబ్ సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తింపుకార్డులు అందుకున్న అజంతా పార్క్ వాకర్స్ క్లబ్ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు అజంతా పార్క్‌లో ఆదివారం వాకర్స్‌కు గుర్తింపు కార్డుల పంపిణీ జరిగింది. అజంతా పార్క్ వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఉప్పలపాటి శుభ, ఇంటర్నేషనల్ క్యాబినెట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ సభ్యులకు కార్డులు అందించారు. కార్యక్రమంలో ఆది రెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి జి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి. కనకారావు, ముఖ్యసలహాదారు జి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోరుబావికి మరమ్మతులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం పల్లివీధి ప్రాంతంలో రెండు వారాల నుంచి బోరుబావి పని చేయడం లేదు. దీంతో స్థానికులు సమస్యను ఆ ప్రాంత సచివాలయ కన్వీనర్ చుక్క వరలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వార్డు కార్పొరేటర్ కొణతాల సుధకు తెలపడంతో సోమవారం బోరుబావి మరమ్మతు పనులు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

యాదవ సంఘం కార్యవర్గ సభ్యులకు అభినందన

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవ వీధి శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం నూతన కార్యవర్గ సభ్యులను మల్కాపురం సీఐ జి.డి.బాబు సోమవారం అభినందించారు. ఇటీవల మల్కాపురం స్టేషన్‌కు కొత్తగా వచ్చిన సీఐను సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. సంఘం సభ్యుల సంక్షేమానికి పాటు పడాలని కొత్త పాలక వర్గానికి సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఉరుకూటి రాజు, అధ్యక్షుడు నూనెల నాయుడు, కార్యదర్శి చట్టి శివకుమార్, కోశాధికారి ఉరుకూటి యశ్వంత్, ఉపాధ్యక్షుడు గొంప శంకర్, జాయింట్ సెక్రటరీ పడగల పవన్‌కళ్యాణ్, అదనపు కార్యదర్శి నూనెల ప్రసాద్, సలహాదారులు నూనెల రాజు, ఎన్.పైడిరాజు, శీర రామకృష్ణ పాల్గొన్నారు.

పోలమాంబ ఆలయంలో శ్రావణ మాస పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని శ్రీపోలమాంబ అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఆలయంలో ఈ పూజలు చేయనున్నారు. వచ్చేనెల 18, 25, సెప్టెంబర్ 1, 8, 15 తేదీల్లో కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. వచ్చేనెల 31న గురువారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన చేయనున్నారు. అమ్మవారికి నెల పూజకు రూ.350 చెల్లించి భక్తులు తమ గోత్ర నామాలతో నెల రోజుల పాటు పూజలు జరిపించుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఆఖరు రోజున అమ్మవారి ప్రసాదం అందిస్తారు. ఆలయంలో ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజుల్లో నిర్వహించే చండీ హోమంలో భక్తులు రూ.1500 చెల్లించి స్వయంగా పాల్గొనవచ్చునని ఆలయ అధికారులు తెలిపారు.

విశేషంగా అమావాస్య తిరువీధి

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని సోమ వారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అలంకరించి పల్లకీలో అధిష్ఠంపజేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. అలయ అర్చకుడు శ్రావణ్‌కుమార్, పారాయణదాలు, పండితులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదలపాలిట వరం.. జగనన్న సురక్ష



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న జెడ్పీ కృష్ణ, కార్పొరేటర్ లక్ష్మణరావు



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు, మహిళలు

- కార్పొరేటర్ లక్ష్మణరావు
- 62వ వార్డులో అట్టహాసంగా జగనన్న సురక్ష కార్యక్రమం

సింథియా: సంక్షేమ పథకాల కోసం గతంలో ఉద్యమాలు జరిగేవి.. అలాంటిది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎలాంటి వివక్ష లేకుండా గడప వద్దకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందిస్తున్నారని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం, దుర్గానగర్-4, ఏఏస్సార్‌కాలనీ, జాలరివీధి, గాంధీజీవీధి సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు మాట్లాడుతూ లంచాలకు తావు లేకుండా పారదర్శకంగా సేవలు అందిస్తున్నామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం పేదప్రజలకు వరం లాంటిదన్నారు. గాంధీజీ కలలు ఉన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థతో ప్రతి గడపకు చేరవేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. గతంలో ప్రతి పనికి కార్యాలయాలు. అధికారులు చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, నేడు జగనన్న సురక్ష క్యాంపుతో ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలు అందిస్తున్నామన్నారు. పథకాల అర్హతతో పాటు ప్రభుత్వ సేవలకు సంబంధించి ఏవైనా పెండింగ్ సమస్యలు ఉంటే వాటిని సత్వరమే పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారికి వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సురక్ష కార్యక్రమం ప్రత్యేక అధికారి రామకృష్ణ, జెడ్పీ ఆర్టీపీ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్వో ఎస్. రాజ్యలక్ష్మి, ఈఈ ప్రసన్న కుమారి, సచివాలయ క్లస్టర్ల కన్వీనర్ భోగవిల్లి నాగభూషణం, వార్డు అధ్యక్షులు భీశెట్టి గణేష్, నూకరెడ్డి, పలు వార్డుల కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఆర్టీఈ సీట్లు బహిర్గతం చేయాలి



పాఠశాల యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న సీతారాం

ఎంవీపీ కాలనీ: ఉచిత విద్య నిర్బంధ హక్కు చట్టం (2009)ను అనుసరించి రాష్ట్రం ప్రభుత్వం ఆదేశాల మేరకు కేటాయించిన సీట్లను ఆయా ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు బహిర్గతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. సోమవారం ఆయన ఎంవీపీ కాలనీలోని పలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించారు. ఈ నేపథ్యంలో సత్యసాయి విద్యా విహార్, క్వీన్స్ పాఠశాలల్లో నోటీసు బోర్డుల్లో ఈ ఏడాది ఆర్టీఈ సీట్లు వివరాలు లేకపోవడంపై ప్రశ్నించారు. ప్రిన్సిపాళ్లు కౌసల్య, భాస్కరిల సమక్షంలో ఆయా వివరాలను నోటీసు బోర్డుల్లో సిబ్బందితో అతికింపజేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టి ఈ చట్టాన్ని అమలు చేస్తున్నాయన్నారు. కరోనాతో మరణించిన తల్లిదండ్రుల పిల్లలకు, బడుగు, బలహీన వర్గాల వారి పిల్లలకు ఈ చట్టం ద్వారా సీట్లు కల్పించడం అద్భుత అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి శ్రీలత, విద్యాశాఖ అధికారులు, సంక్షేమ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం



మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని రహదారిలో పొక్లెయిన్‌తో పనులు చేస్తున్న దృశ్యం

గోపాలపట్నం: జిందాల్ భవనం నుంచి మర్రిపాలెం వుడా లేఅవుట్ కమ్యూనిటీ హాలు వరకు ఉన్న డబుల్ రోడ్డును అభివృద్ధి చేసే పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల ఈ పనులకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ నిధులు రూ. 1.60 కోట్లతో ఈ పనులు చేపట్టారు. డివైడర్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. రెండు రోజులుగా పాడైన డివైడర్‌ను తొలగిస్తున్నారు. సంజీవయ్యనగర్‌లో డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలను తొలగించారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేసి, రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

25న జిల్లా స్థాయి యోగా పోటీలు

అగనంపూడి: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, అనకాపల్లి ఆధ్వర్యంలో ఈ నెల 25న జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.ఆంజనేయులు తెలిపారు. లంకెలపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరవాడ మండలం వెన్నెలపాలెం కల్యాణమండపంలో ఈ పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. బాలబాలికలకు సబ్ జూనియర్ (9 నుంచి 14 సంవత్సరాలు), జూనియర్ (15 నుంచి 18), సీనియర్ (19 నుంచి 28) విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలు వచ్చేనెలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. రాష్ట్ర స్థాయి విజేతలు జాతీయ స్థాయిలో నిర్వహించే ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలియజేశారు. వివరాలకు 97016 58665, 78010 83283 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎం.వి.నాగేశ్వరరావు, పిళ్లా రవిశంకర్, లోవరాజు, అన్నాజీరావు, శ్రీదేవి, రౌతు దేవి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నకిలీ పోలీసులు

కూర్మన్నపాలెం: పోలీసులమని చెప్పి ఇద్దరు వ్యక్తులను బెదిరించి, వారి వద్ద నుంచి నగదు, వస్తువులను కాజేసిన నలుగురు వ్యక్తులను దువ్వాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దువ్వాడ లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. ఆదివారం అర్ధరాత్రి రాజీవ్‌నగర్‌కు చెందిన రౌతు వెంకటరమణ, బోర రమేష్, వడ్లపూడి ప్రాంతానికి చెందిన వెంకటరమణ, బొర్ర శ్రీను మద్యం సేవించి వడ్లపూడి జంక్షన్ వద్ద బైక్‌పై వెళ్తున్న వి.అవినాష్‌ను, అతని స్నేహితుడు రవిని అడ్డగించారు. తాము పోలీసులమని చెప్పి వారిని కొట్టి, బెదిరించారు. వారి నుంచి సెల్‌ఫోన్, రెండు వేల రూపాయల నగదు కలిగిన పర్సు, బైక్‌ను బలవంతంగా లాక్కుని, వారిని పోలీస్‌స్టేషన్‌కు రమ్మని చెప్పి అక్కడి నుంచి ఉడాయించారు. దీంతో బాధితులు సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అవినాష్ ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు ఆ నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

షట్టర్లు విరగ్గొట్టి నాలుగు షాపుల్లో చోరీ



బేకరీలో విరగ్గొట్టిన షట్టర్‌ను చూపుతున్న యజమాని

అక్కిరెడ్డిపాలెం: దుండగులు నాలుగు షాపుల్లో షట్టర్లు విరగ్గొట్టి, నగదు అపహరించారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘటనపై గాజువాక క్రైం ఎస్ఐ మహేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక బీసీ రోడ్డులో రెండు మెడికల్ షాపులు, ఒక బేకరీ, ఒక అక్వేరియమ్‌లో అర్ధరాత్రి దొంగలు షాపుల షట్టర్లు విరగ్గొట్టారు. సోమవారం ఉదయం వచ్చి చూసుకున్న ఆయా షాపుల యజమానులు వెంటనే గాజువాక క్రైం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీం వివరాలు సేకరించింది. నాలుగు షాపుల్లో కలిసి సుమారు రూ.15 నుంచి రూ.20 వేల వరకు నగదును అపహరించారని తెలిపారు. గాజువాక క్రైం ఎస్ఐ మహేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోటరీ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

పెదగంట్యాడ: గాజువాక స్టీల్‌సిటీ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా చెల్లి రుషికేష్ ఎన్నికయ్యారు. పెదగంట్యాడలోని జీవీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా తిరుపతి రావు, కోశాధికారిగా వీటీఎస్ నాయుడు, సభ్యులుగా 14 మంది ఎన్నికయ్యారు. కార్యక్రమానికి హాజరైన జీవీఎంసీ జోన్-6 జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ నారాయణరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలను కొనియాడారు. క్లబ్ మాజీ డైరెక్టర్ కేవై దాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటీతో ప్రమాణం చేయించారు. క్లబ్ ఆధ్వర్యంలో గతేడాది నిర్వహించిన సేవా కార్యక్రమాలపై నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో తెంటు సత్యనారాయణ, కాతా బాలకృష్ణ, దివాకర్, కె.సత్యం బాబు, పి.చంద్రశేఖర్, కె.తిరుపతి, వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



రాజేశ్వరి

సింహాచలం: మహిళ అదృశ్యంపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెందుర్తి సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాలు.. విరాట్‌నగర్‌లో జిన్నింగ్ ప్రాంతానికి చెందిన జీలకర్ర రాజేశ్వరి ఈనెల 15వ తేదీ సాయంత్రం నుంచి కనిపించడం లేదని భర్త జీలకర్ర నాగ సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. రాజేశ్వరి మానసిక పరిస్థితి సరిగ్గా లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ

- హౌస్ కమిటీ పట్టాల కన్వేయన్స్ డీడ్‌లకు క్యూ
- అమావాస్య రోజూ పోటెత్తిన లబ్ధిదారులు



గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కక్షిదారులు

గాజువాక: గాజువాక హౌస్ కమిటీ నిర్మాణాల్లో పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ ఆస్తికి కన్వేయన్స్ డీడ్ (రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్) పొందడానికి బారులు దీరుతున్నారు. మూడు రోజుల కిందట అధికారులు రిజిస్ట్రేషన్లను ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో అర్హులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు భారీగా వస్తున్నారు. హౌస్ కమిటీ పట్టాలతో పాటు అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాలకు సంబంధించి జారీ చేసిన పట్టాలకు కూడా అధికారులు అన్ని హక్కులను కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

48మందికి డీడ్‌లు

హౌస్ కమిటీతో పాటు జీవో నంబర్ 388 ప్రకారం గాజువాకలో పట్టాలు పొందిన వారు 1526 మంది ఉన్నారు. వారికి నగరంలోని ఏడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి అధికారులు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో గాజువాక, పెదగంట్యాడ, లంకెలపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం ఒక్కరోజే 48 మందికి సంబంధిత అధికారులు కన్వేయన్స్ డీడ్‌లను నమోదు చేశారు. అమావాస్య అయినప్పటికీ లబ్ధిదారులు భారీగా రావడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. తాము ఈ కార్యాలయాల్లో సోమవారం 200 మందికి కన్వేయన్స్ డీడ్‌లను ఇవ్వాలని నిర్ణయించగా 48 మందికి పూర్తయ్యాయని గాజువాక తహసీల్దార్ పాల్ కిరణ్ తెలిపారు. మంగళవారం నుంచి మరింత భారీ సంఖ్యలో రిజిస్ట్రేషన్లు పూర్తవుతాయని పేర్కొన్నారు.

ఆటోనగర్‌లో పనులు ప్రారంభించాలని ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడుతున్న రాజన్న ఆటోనగర్ కాలనీవాసులు

మహారాణిపేట: రాజన్న ఆటోనగర్‌లో నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతూ స్క్రాప్ వర్కర్లు ఆందోళన చేపట్టారు. జిల్లా స్క్రాప్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 2019లో స్క్రాప్ వర్కర్స్‌కు ఆనందపురం మండలం కణమాం గ్రామంలో 151.7 ఎకరాలు కేటాయించారని, ఇప్పటి వరకు కార్మికులకు ఈ స్థలం ఇవ్వలేదని సీఐటీయూ నాయకుడు కె.గణేష్ తెలిపారు. ఈ సమస్యను కొంత మంది కార్మికులు తప్పుదారి పట్టిస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దని సీఐటీయూ నాయకుడు వై.రాజు అన్నారు. ఈ స్థలంలో తక్షణం పనులు ప్రారంభించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు నాయకులు వినతిపత్రం సమర్పించారు.

కల్యాణం.. కమనీయం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

నేరాల నియంత్రణపై మహిళా పోలీసులకు అవగాహన



మహిళా పోలీసులకు సూచనలిస్తున్న సీఐ జి.డి.బాబు

మల్కాపురం: ఇండస్ట్రియల్ ఏరియాలోని సచివాలయాల మహిళా పోలీసులకు ' నేరాల నియంత్రణలో మహిళ పోలీసుల పాత్ర' అనే అంశంపై మల్కాపురం సీఐ జి.డి.బాబు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాపురం స్టేషన్ వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో స్టేషన్ పరిధిలోని 25 సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తమ తమ సచివాలయాల పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు,సంఘ వ్యతిరేక శక్తుల సమాచారం కలిగి ఉండాలన్నారు. వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుపడు సమాచారాం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు శాంతి భద్రతలు కల్పించడమే పోలీస్ ధ్యేయమన్నారు. తమ తమ ప్రాంతాల్లో ప్రజలను కలిసి జరుగుతున్న నేరాలు.. వాటిని ఎలా ఎదుర్కోవాలన్న దానిపై అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నా.. గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం ఉంటే తమకు అందించాలన్నారు.

కూలిన రక్షణగోడ

- తప్పిన ప్రమాదం



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న మాజీ కార్పొరేటర్ కన్నబాబు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీ కొండప్రాంతంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రక్షణగోడ దిగువన ఉన్న ఇంటిపై కూలింది.ఇక్కడ అచ్చియ్యమ్మ అనే మహిళ తన కుటుంబ సభ్యులతో ఉంటుంది.అయితే ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి రక్షణగోడ కూలి ఆమె ఇంటిపై పడింది. అటు వైపు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.అయితే ఇంట్లో ఎలక్ట్రానిక్ పరికరాలు, వంట సామగ్రి నష్టపోయామని బాధితులు వాపోయారు.విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు సోమవారం ఉదయం బాధితులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. పశ్చిమ సమన్వకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ద్వారా ములగాడ తహసీల్దార్ వీరభద్రరావు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

పాపాహోమ్‌కు బాలుడి అప్పగింత



తేజకిరణ్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ సాయి

మర్రిపాలెం: పాపా హోమ్ నుంచి తప్పించుకున్న ఓ బాలుడిని కంచరపాలెం పోలీస్‌లు తిరిగి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా తోటకూర గ్రామానికి చెందిన చీపురుపల్లి తేజకిరణ్(9)ను తండ్రి ఈశ్వరరావు మూడు నెలల కిందట నగరంలోని పోలీస్ బ్యారెక్స్ వద్ద గల పాపా హోమ్‌లో చేర్పించారు. అయితే హోమ్ నుంచి తప్పించుకున్న ఆ బాలుడు కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్లపై ఆదివారం సంచరించడాన్ని పోలీసులు గమనించారు. వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ ఎన్.సాయి, ఏఎస్ఐ సతీష్ ఆ బాలుడి వివరాలు తెలుసుకుని మళ్లీ పాపా హోమ్‌కు అప్పగించారు.

వీధి కుక్కల నియంత్రణపై దృష్టి



బాలుడిని పరామర్శించి యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయిస్తున్న సిటీ వెటర్నరీ డాక్టర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో వీధి కుక్కల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ ఆదేశాల మేరకు వెటర్నరీ విభాగపు అధికారి డాక్టర్ కిషోర్ నేతృత్వంలో సిబ్బంది రంగంలోకి దిగారు. 95వ వార్డు పోర్లుపాలెంలో కుక్క దాడిలో గాయపడిన చీపురుపల్లి రుత్విక్ అనే బాలుడిని పరామర్శించారు. యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ఆ వార్డులో సుమారు 25 వీధి కుక్కలను పట్టుకొని ఆపరేషన్ కోసం పంపించినట్టు వెటర్నరీ డాక్టర్ కిషోర్ తెలిపారు. మేయర్ ఆదేశాల మేరకు ప్రతిరోజూ సుమారు 100 వీధి కుక్కలకు ఇసుకతోట, గోపాలపట్నం, గాంధీగ్రామం, నరవ, చినగదిలి, జడ్జికోర్టు సమీపాన గల వెటర్నరీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయనున్నట్టు పేర్కొన్నారు.

ప్లాంట్ పరిరక్షణకు సుదీర్ఘ పోరాటం



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, ఉద్యోగులు

కూర్మన్నపాలెం: మహనీయుల త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కార్మికులు సుదీర్ఘ పోరాటం చేస్తున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దేశంలోని ఏ పరిశ్రమలోనూ ఇంతటి సుదీర్ఘ పోరాటం జరిగిన చరిత్ర లేదని, ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న ఉక్కు దీక్షకే ఈ ఘనత దక్కుతుందని కొనియాడారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 886వ రోజు సోమవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ఆ కుట్రలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

14వ రోజుకు గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



శిబిరం వద్ద మాట్లాడుతున్న కొవిరి అప్పలరాజు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిరాజు, సీఐటీయూ స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరాన్ని సోమవారం సందర్శించిన నాయకులు, కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ కార్మికులకు బేసిక్ రూ.3,700 ఇవ్వడం అన్యాయమన్నారు. డీఏను బేసిక్‌లో కలిపి, రూ.22వేలు బేసిక్ ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ.36వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, పల్లేటి పోలయ్య, నొల్లి తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.